

చిన్నారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన జి.చిన్నారెడ్డిని మంగళవారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాదలో శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు. జి.చిన్నారెడ్డిని కలిసిన వారిలో బాల్‌రాజ్, దేవేందర్, తదితర స్థానిక నాయకులు ఉన్నారు.



చేవెళ్ల సభకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు, నాయకులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతీ ఎకరానికీ నీరందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం చేవెళ్లలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ప్రతీ గ్యారంటీ పథకాన్ని అమలు చేస్తామని, అర్హులందరికీ పథకాలు అందేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా కృషిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సభలో డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మాట్లాడారు.

- కార్యకర్తలెవరూ ధైర్యాన్ని కోల్పోవద్దు
- పార్లమెంట్ ఎన్నికల తరువాత అందరికీ న్యాయం చేస్తాం
- ప్రతీ ఇంటికి వెళ్లి గ్యారంటీలు అందరికీ చేరేలా చూడండి
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి
- బీజేపీ అభ్యర్థి మంచోడే... కానీ ఆ పార్టీనే సక్కగ లేదు
- చేవెళ్ల జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



చేవెళ్ల జన జాతర సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది

ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతీ ఎకరానికి నీరందిస్తాం



రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్/ శంకర్‌పల్లి, ఫిబ్రవరి 27 : ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును విస్మరించిందన్నారు. అయితే ఇపుడు తమ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేసి ప్రతీ ఎకరానికి నీరందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. 'వికారాబాద్ జిల్లా నుంచి ఎన్నికైన నాకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఉన్నారు.' అని తెలిపారు. భవిష్యత్‌లో ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో పాటు మహేందర్‌రెడ్డి, సునీతమ్మ మీకు అండగా ఉంటారని చెప్పారు. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత మాదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించినప్పుడే మాకు నిజమైన గెలుపు అవుతుందన్నారు. కార్యకర్తలు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి తలుపు తట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరు గ్యారంటీలు అందరికీ చేరేలా చూడాలన్నారు. పథకాలు ఎవరికి రాకపోయినా వారి పేర్లు రాసుకుని వారికి ఇప్పించేలా చూడాలని తెలిపారు. వాళ్లే మనల్ని కష్టపడి గెలిపిస్తారని చెప్పారు. ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకువెళ్లేందుకు మీరు సిద్ధమేనా? సిద్ధం అనేటోళ్లు చేతులు ఎత్తండి అని సీఎం పేర్కొన్నారు. పార్టీ నిర్ణయించిన చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నుంచి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిపై పరోక్షంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇక్కడ బీజేపీ నుంచి ఓ నాయకుడు పోటీ చేస్తున్నాడు. పాపం ఆయన మంచోడే. కానీ ఆయన పార్టీనే సక్కగ లేదు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసినా దండగే అవుతుంది.' అని ఎద్దేవా చేశారు. ఏదో జరుగుతుందని బీజేపీలోకి వెళితే ఇక్కడ ఏమీ లేదని, గతంలో ఆ నాయకుడే ఈ విషయం చెప్పాడన్నారు. కవితను జైలుకు పంపిస్తారనుకుంటే పంపలేదని స్వయంగా ఆ నాయకుడే చెప్పినట్లు ఆయన చెప్పారు.

ప్రాణహిత-చేవెళ్ల నీరు రాకుండా చేసిందే కేసీఆర్: భట్టి

చేవెళ్ల నుంచి మాట ఇస్తున్నాం. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ వదిలిపెట్టం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ జన జాతర సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్‌కు చెంపపెట్టులాగా గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాల గ్యారంటీల అమలుతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దశాదిశా నిర్దేశం చేసిందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం. ఇందిరమ్మ రాజ్యం. కుల మతాలను చీల్చి ఓట్లు పొందటం సాధ్యం కాదన్న విషయాన్ని బీజేపీ గ్రహించాలన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా చేవెళ్లకు గోదావరి నీటిని తీసుకువచ్చేలా గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన డాక్టర్ అంబేడ్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును అడ్డుకున్నది కేసీఆరే అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును దిగువకు తెచ్చి ఎత్తు తగ్గించి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించి చేవెళ్లకు నీరు రాకుండా చేసింది గత సీఎం కేసీఆర్ అని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి చేవెళ్లకు కృష్ణా నీటిని తరలిస్తామన్న కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వద్ద తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. బీఆర్ఎస్ పాలకులు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా తంటాలు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఆదాయం వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒకటో తేదీనే జీతాలిచ్చే స్థితికి ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చామన్నారు. డ్వాక్రా మహిళలకు త్వరలోనే వడ్డీలేని రుణాలు ఇవ్వాలని క్యాబినెట్‌లో నిర్ణయించామని చెప్పారు. ఈ పథకం కింద మహిళలకు రూ.వేల కోట్లు ఇవ్వాల్సి వచ్చినా వెనకాడేది లేదన్నారు. గత తొమ్మిదేళ్లగా ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కి మహిళలను ఆర్థిక సాధికారత లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన మహిళా కార్మికులందరికీ ప్రతి నెలా చెల్లింపులు చేస్తున్నామన్నారు. గ్యారంటీ స్కీమ్‌లను అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ వర్తింపజేస్తామన్నారు. పేద, మధ్య తరగి బలహీన వర్గాలకు కార్పొరేట్ ఆస్పత్రిల్లో మెరుగైన వైద్యం పొందటానికి రాజీవ్ ఆరోగ్య శ్రీని రూ.10లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రారంభించిన ఉచిత బస్సు రవాణ ద్వారా రాష్ట్రంలో 18కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు లబ్ధిపొందినట్లు, ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు దీవించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



చేవెళ్ల సభలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

దోపిడీ రాష్ట్రంగా తయారు చేసిన కేసీఆర్ : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను దోపిడీ రాష్ట్రంగా తయారు చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా, తోడుగా ఉంటుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో 17సీట్లకు 14 సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నడుం బిగించాలన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించే సమయం ఆసన్నమైందని తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలు వెంటనే అమలు చేసిందని, మరో రెండు గ్యారంటీలను నేడు అమలుకు సీఎం శ్రీకారం చుట్టారని, నాడు ఇందిరమ్మ పేదలకు ఇళ్లు ఇచ్చిందని నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

చేవెళ్లకు రూ.100కోట్లు ఇవ్వాలి: భీం భరత్

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీం భరత్ కోరారు. బీఆర్ఎస్ అధికారంలో

మిగతా 7వ పేజీలో...

స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు

» డిప్యుటీ డీఎంఅండ్‌హెచ్‌వో

కొత్తూర్, ఫిబ్రవరి 27: ఆర్ఎంపీ/పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని షాద్‌నగర్ డిప్యుటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి హెచ్చరించారు. మున్సిపాలిటీతో పాటు, తిమ్మాపూర్, పెంజర్ల గ్రామాల్లో మంగళవారం ఆర్ఎంపీ క్లినిక్‌లను వైద్య బృందం తనిఖీలు నిర్వహించి ప్రాక్టీషనర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఆర్ఎంపీ క్లినిక్‌లలో రోగులకు కేవలం ప్రథమ చికిత్స(ఫస్ట్‌ఎయిడ్) చేసి, పై ఆస్పత్రులకు పంపాలన్నారు. ఇక్కడ చిన్నారులకు ఎలాంటి వైద్యం చేయకూడదన్నారు. ఆర్ఎంపీలు తమ క్లినిక్‌లకు ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు(ప్రథమ చికిత్స కేంద్రాలు)గా బోర్డులు పెట్టుకోవాలని, ఎంబీబీఎస్, ఇతర సర్టిఫైడ్ కోర్సుల పేర్లను బోర్డుల్లో పెట్టుకోవడం నేరం అన్నారు. స్థానిక బీఏఎంఎస్ డాక్టర్ రంజిత్ ఎంబీబీఎస్ పేరు పెట్టుకొని వైద్యం చేస్తున్నందున అతడికి వైద్యాధికారులు నోటీసులు జారీ చేశారు. వారంలోగా ఆర్ఎంపీలు తమ తీరును మార్చుకోవాలని, లేదంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, సీహెచ్‌వో చిట్టిబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, శ్రీహరి, సూపర్‌వైజర్ రవికుమార్, అనసూయ, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.



బీఏఎంఎస్ డాక్టర్‌కు నోటీసు ఇస్తున్న డిప్యుటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

» ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు » నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతి లేదు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27: ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలను సిద్ధం చేశారు. 195 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుంది. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 74,875 మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరంలో 74,191 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37పోలీస్ స్టేషన్లను గుర్తించారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఒక్కో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల్లో అక్రమాలకు తావు లేకుండా ప్రతి కేంద్రంలోనూ అన్ని గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడపనుంది. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది. ఏఎన్ఎం అందుబాటులో ఉంటారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచుతారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలోని జిరాక్స్ షాపులను రోజూ పరీక్ష ముగిసే మూసి ఉంచుతారు. నిర్దేశిత సమయానికి అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9గంటలకే గేటు మూసి వేస్తారు. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోని అనుమతించరు. సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్లు, బ్లూ టూత్ పరికరాలు, ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను ఎగ్జామ్ సెంటర్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను అమల్లో ఉంటుంది.



చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

హాజరుకానున్న విద్యార్థులు		పరీక్ష కేంద్రాలు	పరీక్ష:
ఫస్ట్ ఇయర్	సెకండియర్		ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు
74,875	74,191	195	




లక్ష్మణ్‌కు స్వాగతం పలుకుతున్న ఆచారి, బీజేపీ నేతలు

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

ఆమనగల్లు, ఫిబ్రవరి 27: దేశంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి పరాభవం తప్పదన్నారు. ఆమనగల్లు బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం లక్ష్మణ్ సందర్శించారు. కొల్లాపూర్‌లో విజయ సంకల్పయాత్రకు వెళ్తున్న ఆయనకు ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులతో లక్ష్మణ్ సమావేశమయ్యారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల గెలుపుతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ కన్వీనర్ శ్రీకాంత్‌సింగ్, శ్రీశైలంయాదవ్, ఝాన్సీశేఖర్, చెన్నకేశవులు, రవి, పద్మప్రశాంత్, మహేశ్, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు



యాచారంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్

యాచారం, ఫిబ్రవరి 27 : డివిజన్ పరిధి ట్రాన్స్‌కోలో భారీ బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల వసూళ్లకు అధికారులు తంటాలు పడుతున్నారు. ప్రతీ నెల ట్రాన్స్‌కో సిబ్బంది గ్రామాల్లో క్యాంప్‌లు పెట్టి ఇల్లిల్లు తిరుగుతున్నా వినియోగదారులు బకాయిలు చెల్లించడం లేదని అధికారులు వాపోతున్నారు. వినియోగదారులు బకాయి చెల్లిస్తేనే సంస్థ మనుగడ ఉంటుందని అధికారులంటున్నారు. యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లో 17,500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నా నెలనెలా ట్రాన్స్‌కో సర్వీసు చార్జీ కింద ప్రతీ కనెక్షన్‌కు రూ.30 వసూలు చేస్తోంది. ఏళ్లుగా వాటిని రైతులు చెల్లించకపోవడం, పాత బకాయిలు కలిపి రూ.3కోట్ల 29లక్షల వరకు పేరుకున్నాయి. క్యాటగిరీ 1 కింద గృహ విద్యుత్ వినియోగ కనెక్షన్లు 7,675 ఉండగా రూ.85లక్షల బిల్లుల బకాయిలున్నాయి. గ్రామ పంచాయతీ కనెక్షన్లు 1,103 ఉండగా రూ.2కోట్ల68లక్షల బకాయిలు పేరుకుపోయాయని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మూడు మండలాలకు ప్రతీ నెల 57.91మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నారు. బకాయిల వసూళ్లకు ట్రాన్స్‌కో అధికారులు గ్రామాలకు తిరుగుతున్నా చాలా మంది బిల్లు చెల్లించడంలేదని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.



సాగవుతున్న వరి

మహేశ్వరంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

- కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌కు భారీ గండి
- హస్తం గూటికి మాజీ ఎమ్మెల్యే తీగల, జడ్పీ చైర్‌పర్సన్
- మామా, కోడలు వెంటే మరికొందరు బీఆర్ఎస్ నేతలు
- గులాబీ పార్టీని ఖాళీ చేయడమే కాంగ్రెస్ నేతల లక్ష్యం!

మహేశ్వరం, ఫిబ్రవరి 27: అభివృద్ధి పేరుతో కొందరు.. అన్యాయం జరిగిందని మరికొందరు.. తమ అభిమాన నేత ఎటైతే తామూ అటే అని మరికొందరు ఇలా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దీంతో మహేశ్వరం నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు తమ పదవులకు, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అలాగే మహేశ్వరం, కందుకూరు మండలాల మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉప సర్పంచ్‌లు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పలు పట్టణాలు, గ్రామాల బీజేపీ కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌లో చేరనున్నారన్న వార్తలు విన్పిస్తున్నాయి. కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి బీఆర్ఎస్‌ను నియోజకవర్గంలో కనుమరుగు చేయాలనే లక్ష్యంతో లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. నాలుగు నెలల్లో జరుగనున్న పంచాయతీ, మండల/జడ్పీ పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీచేయాలనుకునే వారు కూడా బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కావాలంటే అధికార పార్టీ అండ అవసరం ఉన్నందున చాలా మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఐదేళ్లుగా బీఆర్ఎస్ అడ్డాగా ఉన్న మహేశ్వరం ఇక కాంగ్రెస్ గడ్డగా మారనుందనే వార్తలు నియోజకవర్గంలో జోరందుకున్నాయి. వాటికి బలం చేకూర్చేలా వివిధ పార్టీల నుంచి చేరికలూ భారీగానే ఉంటుండడం గమనార్హం.



కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణారెడ్డి, అనితారెడ్డి తదితరులు(ఫైల్)

గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్, ఫిబ్రవరి 27: గ్రామీణ మహిళలకు కాస్ట్యూమ్స్, ఇమిటేషన్, వన్ గ్రామ్ జ్యువెలరీ తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్(ముచ్చింతల్) సంయుక్తంగా ఫిబ్రవరి 28 నుంచి 13 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు 19 నుంచి 45 సంవత్సరాల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాంతో పాటు టూల్‌కిట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జ్యూవెలరీ శిక్షణకు దరఖాస్తు చేసుకునే మహిళలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ జీవీఎఆర్.కృష్ణను సంప్రదించవచ్చని తెలిపారు. వివరాలకు 93914877, 9177141712, 6301890681 లేదా 9618534720 నెంబర్లకు డయల్ చేయవచ్చని సూచించారు.

పల్స్‌పోలియోపై శిక్షణ



మాట్లాడుతున్న హెచ్‌ఈవో వేంకటేశ్వర్లు

ధారూరు, ఫిబ్రవరి 27: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ధారూరులో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో హెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఈ రేణుకుమార్‌లు మాట్లాడుతూ మార్చి 3వ తేదిన 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. 4, 5తేదీల్లో ఇంటింటికీ తిరిగి కార్యక్రమానికి విజయవంతం చేయాలన్నారు. ధారూరు పీహెచ్‌సీ పరిధిలోని 2,495, నాగసమందర్ పీహెచ్‌సీ పరిధిలో 2,930మంది 0-5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరి కోసం 42 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో దండోరా, బైక్ ర్యాలీలు, మైకుల ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు తమవంతు సాయం అందిస్తామని తహసీల్దార్ సాజీదా బేగం, ఎంపీడీవో బి.నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పీహెచ్‌ఎఫ్ ఫాతిమా, సూపర్‌వైజర్ ఉమ, హెల్త్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చాకే పథకాలు అమలు చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27: అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మండల పరిషత్‌లోని ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముందుగా రాష్ట్రంలో అర్హులైన 30లక్షల కుటుంబాలకు తెల్లరేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో పేదవారి నడ్డివిరుస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రేషన్ కార్డులు పంపిణీ చేసినందుకు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ నాయకులు ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ఎలా వసూలు చేస్తారని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తానే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న పదేళ్లలో చేవెళ్ల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజిక వర్గంలో సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. చేవెళ్ల గడ్డ అంటేనే కాంగ్రెస్ అడ్డా అన్నారు. నాడు వైఎస్సార్ పాదయాత్ర చేవెళ్ల నుంచి చేపట్టారని, నేడు రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు చేవెళ్ల నుంచి ఎస్సీ డిక్లరేషన్ బహిరంగ చేపట్టి విజయవంతమయ్యారని తెలిపారు.

కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా రైలు ఇంజన్ లాంటిదని.. మిగతా జిల్లాలు భోగీల లాంటివన్నారు. పాలమూరు-రంగారెడ్డి రాకుండా చేశారని, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డును పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం రేవంత్‌రెడ్డి పూడూరులో నేవీ రాడార్ ఏర్పాటుకు రూ.2,500కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

కేసీఆర్ రూ.7లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అప్పగించారు: షబ్బీర్ అలీ

రూ.10వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ అప్పగించారని పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ అన్నారు. 139 సంవత్సరాల చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. చేవెళ్ల కాంగ్రెస్‌కు సెంటిమెంటన్నారు. ఏ కార్యక్రమాన్ని ఇక్కడ నుంచి చేపట్టినా అన్ని విజయవంతమైనట్లు చెప్పారు.

కవిత లిక్కర్ కేసులో జైలుకు పోవడం ఖాయం: పుష్పలీల

లిక్కర్ కేసులో కవిత జైలుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. కవితను జైలుకు పంపించేంత వరకు వదిలే ప్రసక్తి లేదన్నారు. కూతురుతో పాటు కేసీఆర్‌ను కూడ వదిలిపెట్టమన్నారు. అవినీతికి పాల్పడిన సొమ్మును కక్కిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లను గెలుస్తామని ఆమె తెలిపారు.

బీజేపీ, బీఆర్ఆర్‌కు కనువిప్పు కలిగేలా గ్యారంటీలు: ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు కనువిప్పుల కలిగేలా ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు విడతల వారీగా శ్రీకారం చుడుతోందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నో అవమానాలను భరించాను: సునీతామహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో ఉండి ఎన్నో అవమానాలను భరించానని, మనో వేదనకు గురైనట్లు వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమాలకు ఆకర్శితురాలినై తాను ఇటీవలే కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

ఆరు గ్యారంటీలు అద్భుతం: తీగల అనితాహరినాథ్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లు అద్భుతంగా ఉన్నాయని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మహిళా సాధికారతకు ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

పేదల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: చల్లా నర్సింహారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎంపీగా పోటీ చేసేందుకు ఇతర పార్టీల నేతలు వెనుకంజ వేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..

చేవెళ్లలో జనజాతర పేరుతో కాంగ్రెస్ పార్టీ మంగళవారం నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ అయ్యింది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో మొదటి సారిగా నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. రాత్రికి రాత్రే ఎన్నికల కోడ్ వెలువడటంతో అధికారులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ ఏమాత్రం తగ్గకుండా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అనుకున్న స్థాయిలో జనాలను తరలించడంలో సఫలీకృతమయ్యారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆరు గ్యారంటీలు చేవెళ్ల బహిరంగ సభలో ప్రారంభించాల్సి ఉండగా సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం ఆయన చేవెళ్ల సభకు రోడ్డు మార్గంలో విచ్చేశారు. సభ ప్రాంగణం నిండిపోగా సగానికి పైగా జనాలు ఆరు బయటే ఉన్నారు. రోడ్లన్నీ రద్దీగా మారాయి. సీఎం రేవంత్‌రెడ్డి 40 నిమిషాల పాటు తన ప్రసంగం కొనసాగించారు. పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. సీఎం ప్రసంగం కొనసాగుతున్నంత సేపు కార్యకర్తల చప్పట్లు, కేరింతలతో మార్మోగింది.

సీఎం సమక్షంలో చేరికలు

జనజాతర బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో తాండూరు మాజీ జడ్పీటీసీ సుద్దాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తంరావు,చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అరుణరామేశ్వర్ రెడ్డి, మాజీ చైర్మన్ మాణిక్యరెడ్డి, యువనాయకులు రఘువీర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అప్పా-మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని వినతి

పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఉన్న హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కోరారు. చేవెళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని సభలో వినతిపత్రాన్ని అందజేశారు. ముడిమ్యాల అటవీ ప్రాంతంలో ఐటీ కారిడార్, చేవెళ్ల వరకు మెట్రోరైలు విస్తరించాలని కోరారు. చేవెళ్లలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును త్వరగా ఏర్పాటు చేయాలని, చేవెళ్ల పార్లమెంటు కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని వినతిలో కోరారు.

భారీ బందోబస్తు

జనజాతర బహిరంగసభకు సీఎం రేవంత్‌రెడ్డి రాకా సందర్భంగా సైబరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. 1260 మంది అధికారులు, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తులో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నగరం నుంచి రోడ్డు మార్గం చేవెళ్ల సభకు రావడంతో పోలీసులు దారిపొడవున భద్రత పెంచారు. ముఖ్యంగా అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల వరకు పోలీసులు పహారా చేపట్టారు. సభలో సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిషత్ చైర్మన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, వంశీచందర్‌రెడ్డి, మాజీ మ్మెల్సీ యాదవరెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రావు, జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మల్లు రవి, షబ్బీర్ ఆలీ, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు పామెన భీంభరత్, నరేందర్ ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ముధుసూదన్‌రెడ్డి, పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మాణెయ్య, చంద్రశేఖర్, వెంకటయ్య, జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మండడి చంద్రారెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రెండు నెలలు గడిచినా.. డబ్బులు రాలేదని పత్తి రైతుల నిరసన

పరిగి, ఫిబ్రవరి 27: పత్తిని విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా తమకు ఇంకా డబ్బులు ఖాతాలో జమకాలేదని పత్తి రైతులు నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రెండు నెలల కిందట పత్తి పంట విక్రయించారు. అయితే వారం రోజుల్లోనే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న చెప్పిన అధికారులు ఇంత వరకు జమ చేయలేదన్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పత్తి డబ్బులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాత్రికి రాత్రే మాయం!

- ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నర్సరీ బోర్డులు, శిలాఫలకం, మొక్కలు కనుమరుగు
- పట్టించుకోని అధికారులు



ఘట్‌కేసర్‌లో మాయమైన మున్సిపాలిటీ నర్సరీ కమాన్



గతంలో ఉన్న కమాన్, శిలాఫలకం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాల కిందట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ రాత్రికి రాత్రే మాయమైంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2020 సెప్టెంబరు 26న 10వ వార్డులో గల సర్వేనెంబర్ 127లోని స్టైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కు స్థలంలో నర్సరీని ఏర్పాటు చేశారు. మూడున్నర సంవత్సరాలకే నర్సరీ కనుమరుగవడమేంటని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. 9560చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నర్సరీ కమాన్ (స్వాగతతోరణం), మంత్రి మల్లారెడ్డి ప్రారంభించిన శిలాఫలకం, అందులోని వేలాది మొక్కలు జాడలేకుండా పోయాయి. గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ ఉన్నట్టుండి ప్రైవేటు పరమైంది. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన గేటుపై కందకట్ల మాధవరెడ్డిది అని, అతడి ఫోన్‌నెంబర్ రాసి ఉంది. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన నర్సరీ ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఎలా వెళ్లిందని, ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నారు. మున్సిపాలిటీ అధికారుల, ప్రజాప్రతినిధుల చేతివాటం లేనిదే నర్సరీ మాయమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నర్సరీ ఏర్పాటుకు రూ.23లక్షల ఎల్ఆర్ఎస్ నిధులు కేటాయించి అభివృద్ధి చేశారు. దీంతో పాటు మరిన్ని నిధులు కేటాయించి మొక్కలు పెంచారు. ఇప్పుడు అక్కడ ప్రైవేట్ వ్యక్తి పేరుతో బోర్డు వెలవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అది ప్రైవేట్ స్థలం అయితే.. ప్రైవేటు స్థలంలో లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులతో నర్సరీని ఎలా ఏర్పాటు చేశారు? దాదాపు మూడున్నర సంవత్సరాల పాటు స్థల యాజమని ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈవ్యవహారం మొత్తం మున్సిపల్ అధికారి, బీఆర్ఎస్‌కు చెందిన ఓ ముఖ్య నాయకుడి కనుసన్నుల్లోనే జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అడుగడుగునా అక్రమాలు వెలుగుచూస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా కోట్ల రూపాయల విలువ చేసే నర్సరీ మయమవడం పట్ల అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు మున్సిపాలిటీలో అసలేం జరుగుతుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఘట్‌కేసర్‌లో ఎన్ని కుంభకోణాలు జరిగినా కనీసం చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నా భూమిలో నర్సరీని ఏర్పాటు చేశారు

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లోని 9560చదరపు గజాల స్థలం నాదే. నా పట్టా భభూమిలో అక్రమంగా నర్సరీని ఏర్పాటు చేశారు. గతంలో పని చేసిన కమిషనర్లతోపాటు ప్రస్తుత కమిషనర్‌కు సైతం ఈ విషయంపై వినతిపత్రాలు అందించాను. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించాను. నాస్థలాన్ని నేను పొందడానికి నానాతంటాలు పడాల్సివస్తోంది. చివరకు మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేసే స్థలాన్ని స్వాదీనం చేసుకున్నా.

- కందకట్ల మాధవరెడ్డి, ఘట్‌కేసర్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని స్టైమ్‌ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీకి చెందిన నర్సరీ విషయం ఇంకా నా దృష్టికి రాలేదు. బుధవారం నర్సరీని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ఎండీ సాబేర్ అలీ కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ


మాట్లాడుతున్న ఎగిరిశెట్టి సత్యం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 27 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవిల విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయ సోపానమన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ కనుమరుగవుతుందన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు ముందుకు సాగాలని సత్యం పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బాల్‌రామ్, నర్సింహ, పబ్బతి శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమకాలు సమకూర్చిన నాయకులు



తలకొండపల్లి, ఫిబ్రవరి 27 : మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన శంకరయ్య రెండేళ్ల క్రితం ట్రాక్టర్ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో ఆయన కుడికాలును తొలగించారు. దాంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కాను శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి రూ.1.20 లక్షలతో జైపూర్ నుంచి కృత్రిమకాలు తెప్పించారు. మంగళవారం శంకరయ్యకు కృత్రిమకాలును అందజేయగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి మార్చి 19 వరకు ఎగ్జామ్స్
- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు


ఆమనగల్లు : పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు

ఆమనగల్లు/చేవెళ్ల, ఫిబ్రవరి 27 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19 వరకు కొనసాగే పరీక్షలకు ఆమనగల్లు పట్టణంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య, డీవో రామస్వామి తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలోని 4 కళాశాలల విద్యార్థుల కోసం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మొత్తం 665 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వారిలో 390 మంది ప్రథమ, 275 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెంటయ్య, రామస్వామిలు వివరించారు. 20మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షల నేపథ్యంలో కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పరీక్ష కేంద్రంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్ల మూసివేతకు నోటీసులు జారీ చేసినట్లు ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్నట్లు చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల నిర్వహణ కస్టోడియన్ నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకర్లతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. చేవెళ్ల మండల కేంద్రంలో మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 298 మంది, వివేకనంద జూనియర్ కళాశాలలో 291 మంది, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 288 మంది, చేవెళ్ల మోడల్ జూనియర్ కళాశాలలో 394 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. మొత్తం 1271మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని నరేష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కేశంపేట మండలం కొత్తపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ విద్యార్థులు 164 మంది, ద్వితీయ విద్యార్థులు 168 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు.

మహేశ్వరం ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలకు ఓకే

అనుమతి లేనిదే ఫలితాలు వెల్లడించొద్దు: హైకోర్టు


మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయం

హైదరాబాద్/మహేశ్వరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మండల ప్రజాపరిషత్ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ కొనసాగించుకోవచ్చని, అయితే ఫలితాలు తమ అనుమతి లేకుండా వెల్లడించరాదని హైకోర్టు స్పష్టం చేసింది. మండలంలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఎంపీపీని ఎన్నుకోవడం చెల్లదని పేర్కొంటూ మహేశ్వరం వైఎస్ ఎంపీపీ ఆర్.సునీత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ పంచాయతీరాజ్ (కండక్ట్ ఆఫ్ ఎలక్షన్) రూల్స్ -2018ను సవరిస్తూ తాజాగా జీవో 11 జారీచేశారని పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించే ముందు ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలన్న నిబంధనలు తాజా జీవో డిలీట్ చేయడం చెల్లదని పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో మాన్‌సాన్‌పల్లి ఎంపీటీసీ స్థానం ఖాళీ ఉందని.. ఈ నేపథ్యంలో ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక చేపట్టరాదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మండల ప్రజాపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు ముందు ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు పెట్టాలన్న నిబంధనను ఎందుకు డిలీట్ చేశారనేదానికి సరైన సమర్థన లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మహేశ్వరం ఎంపీపీ అధ్యక్ష పదవి ఎన్నికల ఫలితాలు తమ అనుమతి లేకుండా విడుదల చేయరాదని పేర్కొంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా, నేడు మహేశ్వరం ఎంపీపీ ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలంటూ నోటీసులు అందజేశారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

- బైక్‌పై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలు

శంషాబాద్, ఫిబ్రవరి 27 : బైక్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని రాంనగర్‌గుండులో నివాసముండే రాజమ్మ(50).. సోమవారం సొంతూరు మహబూబ్‌నగర్ జిల్లా కండ్లకోయ మండలం నల్లవెల్లి గ్రామానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తన చిన్న కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరింది. శంషాబాద్‌లోని నెక్సా షోరూం వద్దకు రాగానే రాజమ్మకు ఒక్కసారిగా కళ్లు తిరిగినట్లై బైక్‌పై నుంచి కిందపడింది. దాంతో ఆమె తలకు తీవ్రగాయాలు కాగా శ్రీకాంత్ ఆసుపత్రికి తరలించాడు. చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందింది. ఆమె పెద్ద కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

తాళం వేసిన ఇళ్లకు కన్నం

- 42వేల నగదు, తులం బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

కందుకూరు, ఫిబ్రవరి 27: తాళం వేసిన రెండు ఇళ్లకు గుర్తుతెలియని దుండగులు కన్నంవేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దెబ్బడగూడకు చెందిన సురసాని కమలమ్మ సోమవారం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. అదేవిధంగా ఆమె ఇంటిపక్కనే ఉన్న కళ్లె లక్ష్మమ్మ 15 రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ రెండు ఇళ్లను టార్గెట్ చేసిన దుండగులు సోమవారం అర్ధరాత్రి తాళాలను విరగ్గొట్టి చోరీకి పాల్పడ్డారు. కమలమ్మ మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించింది. బీరువా తెరచి చూడగా వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. 42వేల నగదుతో పాటు తులం బంగారం ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా లక్ష్మమ్మ ఇంట్లో పది తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేసింది. సీఐ మక్బుల్‌జానీ క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి

- డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ధరణికుమార్



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27: మార్చి 3 నుంచి 5వరకు నిర్వహించతలపెట్టిన పల్స్ పోలియో ప్రోగ్రాంను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ధరణికుమార్ కోరారు. ఈమేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని 8 పీహెచ్‌సీలు, ఓపీపీ యూనిట్ ద్వారా గుర్తించబడిన 0-5 సంవత్సరాల పిల్లలు 63,204మంది ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 286 కేంద్రాల్లో పల్స్ పోలియో చుక్కలు వేస్తారని, ఇప్పటికే 572 బృందాలతో ఇంటింటి సర్వే చేయించామని తెలిపారు. 29మంది సూపర్‌వైజర్లు, 10 మొబైల్ టీంలు పాల్గొంటున్నాయని ఆయన చెప్పారు. ఇప్పటికే మండలాలు, మున్సిపాలిటీల్లో సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చామని ఆయన తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


కేశంపేట : బొదునంపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కేశంపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని దవళ గిరి గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గరుడసేవ నిర్వహించారు. మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి-పద్మ, గూడ రామ్మోహన్‌రావు- నీరజ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వేద పండితులను రప్పించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


చౌదరిగూడ : జ్యోతిర్లింగ మహాపడిపూజలో పాల్గొన్న శివస్వాములు, భక్తులు

భక్తిశ్రద్ధలతో హోమం

కేశంపేట మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం హోమం నిర్వహించారు. అంతుకుముందు దాన్యాధివాసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన లింగారెడ్డి, అంజయ్య, శేఖర్, బీరప్ప, రామేష్, అంజనేయులుగౌడ్, పాండు, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, కోటీశ్వర్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన నేపథ్యంలో గ్రామంలో కొత్త శోభ సంతరించుకుంది.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ

చౌదరిగూడ : జ్యోతిర్లింగ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి గురుస్వాములు కమ్మరి భూపాలచారి, బుచ్చయ్య ఆధ్వర్యంలో చౌదరిగూడ గ్రామానికి చెందిన చెన్నయ్య ఇంటి ఆవరణలో ద్వాదశ జ్యోతిర్లింగ పడిపూజను శివస్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చౌదరిగూడ గ్రామం శివనామ స్మరణతో మార్మోగింది. అనంతరం శివస్వాములకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో స్వాములుశ్రీనివాస్, యాదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


యాచారం ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా విధుల్లో చేరిన నర్సులతో ఎంపీపీ సుకన్యబాషా

యాచారం, ఫిబ్రవరి 27 : రోగులకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. మంగళవారం ఆమె యాచారంలోని ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు? వైద్యసేవలు ఎలా అందిస్తున్నారు? తదితర విషయాలపై ఆరా తీశారు. డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. కొత్తగా 9 మంది నర్సులు ఆస్పత్రిలో విధుల్లో చేరడంతో వారిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పల్లె వైద్యశాలల్లో తగిన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉదయం 10.30గంటలకు వైద్యులు ఆసుపత్రులకు వచ్చేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసి రోగులను ఆదుకోవాలన్నారు. వైద్యసిబ్బంది తరచూ గ్రామాలను సందర్శించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో రోగులకు తాగు నీటి వసతి కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలకు అంతర్జాతీయ ఖ్యాతి


వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న హరినారాయణ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 27 : సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయి లో ఖ్యాతి గడించి అగ్రభాగాన నిలిచిందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ్ బట్టాడ్ అన్నారు. నేడు లయన్స్‌క్లబ్ సేవలు ప్రతీ మారుమూల గ్రామానికి విస్తరించాయని ఆయన అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని హన్‌మాన్ దేవాలయం వద్ద లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును మంగళవారం ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటుచేసిన పార్క్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్ సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ లయన్ నందడి నరేందర్‌రెడ్డి, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ లయన్ చెన్నకిషన్‌రెడ్డి, సురేష్, జగన్, రమేష్, దేవేంద్రచారి, డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి


బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

మంచాల, ఫిబ్రవరి 27 : యువత క్రీడలతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో శ్రీ వేణుగోపాల స్వామి జాతరను పురస్కరించుకుని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు మంగళవారం మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని యువసేన యూత్‌కు సుంకరి జయంత్ సహకారంతో రూ.20వేలు, రెండవ బహుమతి శ్రీరామ్ యూత్‌కు వెదిరె వెంకటరమణారెడ్డి సహకారంతో రూ.15వేలు, తృతీయ బహుమతిని పాండవసేన-బీ టీంకు గుడ్డిమల్ల చంద్రయ్య సహకారంతో రూ.10వేలు, నాలుగో బహుమతిని పాండవసేన-ఏటీంకు మార సురేష్ సహకారంతో రూ.5వేలతో పాటు షీల్డులు అందజేశారు. మాజీ సర్పంచులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, పండరీనాథ్, మాదగోని మాసయ్యగౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్, రావుల బాషా, బుగ్గరాములు, హన్మంత్‌రెడ్డి, సాతిరి ఎల్లేష్, బుట్టి కృష్ణ, అంతటి రాజు, జంగయ్యగౌడ్, మార లక్ష్మణ్, వస్పరి కుమార్, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్

షాద్‌నగర్, ఫిబ్రవరి 27: షాద్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ పెన్షనర్స్ భవన్‌లో అవేర్ సంస్థ, పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కామినేని, వాసన్ ఐకేర్ హాస్పిటల్ డాక్టర్లచే ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ మాట్లాడుతూ పెన్షనర్స్ సంక్షేమం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. వైద్య శిబిరంలో డాక్టర్‌లు వర్ష, తేజస్విని, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ అశోక్‌రాజ్, పెన్షనర్స్ అసోషియేషన్ అధ్యక్షులు రామారావు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ తదితరులున్నారు.


ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

షాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు

షాబాద్, ఫిబ్రవరి 27 : షాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ మహబూబ్‌నగర్ జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. షాద్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో పరిధిలోని షాబాద్, కొందుర్గు ఆర్టీసీ బస్‌స్టేజీ ఆవరణలో ఆర్థిక వనరులు పెంపొందించేందుకు అన్నిరకాలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అవసరం మేరకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. షాబాద్ బస్టాండ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు టెండర్లు సైతం నిర్వహించామన్నారు. ఆమెవెంట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందచేస్తున్న డీఈవో సుశీందర్‌రావు

మాడ్గుల, ఫిబ్రవరి 27 : మండలంలోని కొల్కులపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్(ఆంగ్లం) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈమేరకు మృతుడి కుటుంబాన్ని డీఈవో సుశీంద్రరావు నగరంలోని మ్యాక్స్ క్యూర్ హాస్పిటల్‌లో మంగళవారం కలిసి పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20వేల ఆర్థిక సాయం అందచేశారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని పల్లె తండాకు చెందిన నేనావత్ బాగ్యనాయక్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా సమకూర్చిన రూ.3వేలు, 50కిలోల బియ్యాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ కల్లు రాజవర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో సర్దార్, ఉపాధ్యాయులు దేవయ్య, లక్ష్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్నె శ్రీశైలం జయంతి వేడుకలు


శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉప్పుల నర్సింహ, నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 27: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నె శ్రీశైలం జయంతి వేడుకలు ఆమగల్లు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ కూడలిలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు కావి వినోద్, నాగిళ్ల రమేశ్, ఎర్రవోలు మహేశ్, నిరంజన్, శ్రీకాంత్, రాజు మల్లేశ్, గౌతమ్, రామలింగం, మల్లేశ్, భరత్, విజయ్, బుచ్చన్న, అమృనాయక్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు, ఫిబ్రవరి 27 : పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. సాయంత్రం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ సుజాత అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశంలో పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్ చుక్క సావిత్రి, ఉపాధ్యాయులు శ్వేత, స్వాతి, హైమావతి, చలం, యాదయ్య, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, శ్రీజన్య, రాధిక, గీత, మమత, తేజ, నందిని రాధిక, వరలక్ష్మి, ఝాన్సీ, నాగమణి, అలేఖ్య, తదితరులున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హామీల అమలుకు కాంగ్రెస్ కృషి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ

కడ్తాల్, ఫిబ్రవరి 27: రాష్ట్రాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసకుంటుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీ పథకాలు అమలుచేసిన సీఎం రేవంత్.. రెండో విడత రూ.500లకు వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించడం హర్షణీయమన్నారు. మరో రెండు గ్యారంటీ పథకాలు త్వరలో అమలు చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనను జీర్ణించుకోలేక బీఆర్ఎస్, బీజేపీలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయన్నారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సిహ, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు చేగూరి వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, హీరాసింగ్, రాంచందర్‌నాయక్, మంకి శ్రీను, రాజేందర్ గౌడ్, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్‌నాయక్, నరేందర్, రాము, శంకర్, బాలరాజ్, భాస్కర్‌రెడ్డి, కృష్ణ, హనుమ నాయక్, యాదగిరిరెడ్డి, నరేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలి : సీఐ

కొత్తూర్, ఫిబ్రవరి 27: కష్టాల్లో ఉన్నవారిని అమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదుకోవాలని స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు సూచించారు. కాగా, ఫౌండేషన్‌ను సారా వినయ్‌కుమార్‌గౌడ్ అనే యువకుడు ఏర్పాటుచేయగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫౌండేషన్‌కు సంబంధించిను బోర్డును ఇన్‌స్పెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకొని సహాయ సహకారాలు అందజేయాలని వినయ్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. ఈసందర్భంగా వినయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సేవా దృక్పథంతోనే అమ్మ ఫౌండేషన్‌ను స్థాపించానని, ఆపదలో ఉన్నవారిని తప్పకుండా ఆదుకుంటామని తెలిపారు. ఎస్సై జి.శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు శివకృష్ణ, రాజునాయక్, రఫీక్, లతీఫ్, రాజుగౌడ్, సంతోష్ కుమార్, సురేందర్, శివశంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫౌండేషన్ బోర్డును ఆవిష్కరిస్తున్న నర్సింహారావు